ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శుక్రవారం 8 నవంబరు 2024

న్యూస్ బాక్స్

పాఠశాలలను పరిశీలించిన జిల్లా రిసోర్స్‌పర్సన్

ఎలిగేడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ ప్రాథమికోన్నత, ధూళికట్టలోని ప్రాథమిక పాఠశాలలను జిల్లా రిసోర్స్ పర్సన్ సంపత్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్ఎం గండ్ర దేవేందర్‌రావులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా (విద్యా ప్రమాణాలు) పెంచడానికి తీసుకుంటున్న చర్యలు వాటి అమలుతీరుపై వారు సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠ్యాంశ బోధనలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ప్రభుత్వ నిబంధనలను వారికి తెలిపారు. రెండు పాఠశాలల్లో జరుగుతున్న బెస్ట్ ప్రాక్టీసెస్ నమోదు చేసుకొని కలెక్టర్ దృష్టికి తీసుకెళుతామని సంపత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేశ్వర్‌రెడ్డి, యుగేందర్, సీఆర్‌పీ లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వసతిగృహాల విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ

పెద్దపల్లి కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : శీతాకాలం వస్తున్నందున జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల వసతి గృహాల్లోని విద్యార్థులకు బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. గురువారం జిల్లావ్యాప్తంగా ఉన్న వసతిగృహ విద్యార్థులకు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి, యం. నాగైలేశ్వర్ ఉలెన్ బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారి యం. సత్యనారాయణ, వసతిగృహాల అధికారులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు 'మహాలక్ష్మి' వరం

- ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో ప్రతి నెలా రూ.15-20 లక్షల వరకు ఆదా
- ఆయా రూట్లలో బస్సుల సంఖ్య పెంచాలి


పెద్దపల్లి బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న విద్యార్థినులు, మహిళలు(ఫైల్)

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న మహాలక్ష్మి పథకం ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు వరంగా మారింది. ప్రతినెలా తల్లిదండ్రులకు బస్‌పాసుల రూపేణా, ప్రైవేట్ బస్సులకు చెల్లించే డబ్బులు ఆదా అవుతున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా 15 నుంచి 20 లక్షల రూపాయలకు పైగా ఆదా అవుతున్నాయి. గత ఏడాది జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా మహాలక్ష్మి పథకం ఒకటి. దీని ద్వారా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళలకు నెలకు 2500 రూపాయలు ఇస్తామని ప్రకటించారు. డిసెంబర్ 7వ తేదీన కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. డిసెంబర్ 9వ తేదీ నుంచి మహిళలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం పథకాన్ని ప్రారంభించారు. అలాగే 5 లక్షల వరకు ఉచిత ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 10 లక్షలకు పెంచారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆర్టీసీ బస్సులు మహిళలు, విద్యార్థినులతో కిటకిటలాడుతున్నాయి. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వంపై నెలకు సుమారు 350 కోట్ల రూపాయల వరకు భారం పడుతున్నది. ఈ పథకం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పని చేసే మహిళా ఉద్యోగులకు ఆర్థిక భారం తప్పింది. తాము నివసిస్తున్న ప్రాంతం నుంచి పనిచేసే చోటికి ఆర్టీసీ బస్సుల్లో గానీ, ప్రైవేట్ వాహనాల్లో గానీ వెళ్లేందుకు నెలకు 2వేల నుంచి 3వేల రూపాయల వరకు వెచ్చిస్తున్నారు. ఉచిత ప్రయాణం వల్ల వారందరికీ డబ్బులు ఆదా అవుతున్నాయి.

● విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు

అలాగే జిల్లాలోని పెద్దపల్లి, గోదావరిఖని, సుల్తానాబాద్, మంథని, ధర్మారం, తదితర ప్రాంతాల్లో గల ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు ఉన్నాయి. నిత్యం కళాశాలలు, పాఠశాలలకు గ్రామాల నుంచి 10 వేల మంది విద్యార్థినుల్లో కొందరు బస్ పాస్‌లు తీసుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుండగా, మరికొందరు ప్రైవేట్ విద్యా సంస్థలు ఏర్పాటు చేసే వ్యాన్లలో ప్రయాణిస్తున్నారు. బస్ పాస్‌లకు వెచ్చించే డబ్బులు, వ్యాన్లకు చెల్లించే డబ్బులు తల్లిదండ్రులకు ఆదా అవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్దపల్లి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ బస్టాండ్లు విద్యార్థులతో కిక్కిరిసిపోతున్నాయి. విద్యార్థినులకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించడం వల్ల వారి తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పుతున్నది. అయితే విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు ఉదయం వచ్చేటప్పుడు, సాయంత్రం ఇళ్లకు వెళ్లేటప్పుడు ఆయా రూట్లలో సరిపడా బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సీట్లు నిండడమే గాకుండా, బస్సులో మరో 30మంది వరకు కిక్కిరిసి ఎక్కుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. నిలబడేందుకు చోటు లేకుండా జనం ఎక్కుతుండడంతో చాలా ఇబ్బంది పడాల్సి వస్తున్నదని విద్యార్థినులు చెబుతున్నారు.

మిగతా 8వ పేజీలో...

ప్రగతి ప్రణాళికల రూపకల్పనకే ఇంటింటి సర్వే

- సర్వేపై ఎలాంటి అపోహలు వద్దు - మంత్రి శ్రీధర్‌బాబు


భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ప్రగతి ప్రణాళికలు రూపకల్పన కోసం తమ ప్రజా ప్రభుత్వం ఇంటింటి సర్వేను నిర్వహిస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మంథనిలో రూ.75 లక్షలతో నూతనంగా నిర్మించే కేడీసీసీ బ్యాంక్ భవన నిర్మాణానికి మంత్రి శ్రీధర్‌బాబు గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపై కొంతమంది ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇంటింటి సర్వే ప్రజలకు ఎలాంటి అపోహలు వద్దన్నారు. ఈ సర్వేతో ప్రస్తుతం అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలకు, భవిష్యత్తులో అమలు చేసే పథకాలకు ఎటువంటి సంబంధం లేదన్నారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలన్నారు. హౌస్ లిస్టింగ్ పూర్తిచేసినా స్టిక్కర్ వేయని ఇండ్లను గుర్తించి వాటికి గల కారణాలను తెలుసుకొని చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చుకుంటూ వస్తున్నామన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే సబ్సిడీ గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచామన్నారు. రైతుల నాణ్యమైన ధ్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేసి 48 గంటల్లో డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుంటామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కోసం రూ.18వేల కోట్లు చెల్లించామన్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రైతుల సన్న వడ్లకు రూ. 5వందల బోనస్ ప్రకటించామన్నారు. గతంలో మాదిరిగా రైతుల వద్ద ఎలాంటి కోతలు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సీఈవో సత్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్, నేతలు శశిభూషణ్ కాచే, వొడ్నాల శ్రీనివాస్, ఐలి ప్రసాద్, రావికంటి సతీష్‌లు పాల్గొన్నారు.

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన

జూలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కల్పన సూచించారు. మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. అధ్యాపకుల బోధనాతీరును పరిశీలించారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు పెంచేందుకు పలు సలహాలు, సూచనలను అధ్యాపకులకు అందించారు. విద్యార్థులకు స్టడీ హవర్సు నిర్వహించి సకాలంలో సిలబస్‌ను పూర్తి చేయాలని ఆమె సూచించారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలందరూ సహకరించాలి

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కోకా కోలా యూనిట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. మండలంలోని ఆరెంద, అడవి సోమన్‌పల్లి గ్రామాల్లో కలెక్టర్ శ్రీహర్ష గురువారం పర్యటించారు. ఆరెందలో జరుగుతున్న ఇంటింటి సర్వే తీరును, జడ్పీహెచ్ఎస్ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం అడవిసోమన్‌పల్లి గ్రామశివారులోని సర్వేనంబరు 192లో కోకా కోలా కంపెనీ యూనిట్ స్థాపన కోసం 80 ఎకరాల స్థలాన్ని టీజీఐఐసీ వైస్ చైర్మన్ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు తమకు కేటాయించిన ఇండ్లను సందర్శించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలన్నారు. ఆరెంద ప్రభుత్వ పాఠశాలకు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల జాబితా ఇస్తే విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఆర్డీవో సురేష్, తహసీల్దార్ రాజయ్య, టీజీ ఐఐసీ చీఫ్ ఇంజనీర్ వినోద్‌కుమార్, జోనల్ మేనేజర్ పద్మజ, డిప్యూటీ జెడ్ఎం మహేశ్వర్, హెచ్ఎం శ్రీలతలు ఉన్నారు.

క్యాన్సర్ వ్యాపించకుండా జాగ్రత్తలు పాటించాలి

- ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమాదేవి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రమాదేవి

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో క్యాన్సర్ అనే మహమ్మారి ఒక పెనుభూతంగా తయారైందని, దీన్ని వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సుల్తానాబాద్ ప్రభుత్వ అసుపత్రి సూపరింటెండెంట్, గైనకాలజిస్టు డాక్టర్ రమాదేవి అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన క్యాన్సర్ అవగాహన సదస్సును డాక్టర్ రమాదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాన్సర్ కారకాలను గుర్తించి రేడియం మూలకాన్ని కనుగొన్నందుకు క్యూరీ జన్మదినాన్ని క్యాన్సర్ అవగాహన దినోత్సవంగా జరపుకుంటున్నామని అన్నారు. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్, ఎండోమెట్రియల్ క్యాన్సర్ ఓవేరియన్ క్యాన్సర్ లాంటివి వ్యాపించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యాన్సర్ వచ్చిందని భయభ్రాంతులకు లోనవకుండా ముందే పసిగట్టి డాక్టర్‌ను సంప్రదించాలని తగు నివారణ చర్యలు తీసుకోవాలిని సూచించారు. ఇలాంటి నివారణ చర్యల ద్వారా క్యాన్సర్‌ను అరికట్టవచ్చని అన్నారు. క్యాన్సర్ కారకాలైనటువంటి అల్కహాల్, ధూమపానం, పాన్ మసాలా గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. సాధ్యమైనంత వరకు స్వచ్ఛమైన కూరగాయలు, బలవర్ధకమైన ఆహారం తీసుకోవాలని, బయట లభించే జంక్ ఫుడ్స్‌ని బహిష్కరించడం వలన ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ మాటేటిశ్రీనివాస్, సంజీవ్‌కుమార్, కృష్ణప్రియ, ప్రతినిధులు సాంబమూర్తి, చకిలం వెంకటేశ్వర్లు, నేముల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కులు పంపిణీ

ఓదెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీలకుంటకు చెందిన నల్ల శ్రీనివాస్‌రెడ్డి, కనగర్తికి చెందిన కుందారపు రాజయ్యలు విద్యుత్ ప్రమాదంలో మృతిచెందగా, విద్యుత్ శాఖ ద్వారా బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- దళారులను నమ్మి మోసపోవద్దు - పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు


హన్మంతునిపేటలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. గురువారం పెద్దపల్లి మండలం పెద్దకల్వల, పెద్దబొంకూర్, కొత్తపల్లి, మూలసాల, బొజన్నపేట, హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, ముత్తారం గ్రామాల్లో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే విజయరమణరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని తెలిపారు. సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. ధాన్యంలో తరుగు పేరుతో కోతలు లేకుండా చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యానికి 48 గంటల్లో రైతులకు డబ్బులు చెల్లించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ అసత్య ప్రచారాలు నమ్మవద్దని రైతులను కోరారు. ప్రభుత్వం ప్రకటించిన మేరకు ధాన్యంలో తేమ శాతం ఉండేలా రైతులు చూసుకోవాలని తెలిపారు. రైతుకు అండగా ఉంటానని, ఏ చిన్న సమస్య తలెత్తినా ఫోన్ చేస్తే స్పందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, సింగిల్‌విండో చైర్మన్ మాదిరెడ్డి నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, సత్యం, సంతోష్, రమేష్, మల్లేష్, కుమార్, తిరుపతిరావు, సుధాకర్ రెడ్డి, మోహన్, సతీష్, సుకూర్, శ్రీకాంత్, రమేష్, సింగిల్‌విండో సీఈవోలు మదన్‌మోహన్, సురేష్‌తో పాటు డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా..

నిరాశ్రయులకు కర్మకాండ వసతి గృహం

- నిరుపేదల అంత్యక్రియలకు రూ. ఐదు వేల ఆర్థికసహాయం
- ఆపద కాలంలో ఆదుకుంటున్న రామకృష్ణ సేవా సమితి ఆదర్శం

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అద్దె ఇంటిలో ఉన్న వారిలో ఎవరైనా మరణిస్తే కర్మకాండలు నిర్వహించేందుకు ఇంటి యజమానులు ఒప్పుకోని సంఘటనలు ఎన్నో ఎదురవుతున్నాయి. ఎక్కడ ఉండాలో.. ఏం చేయాలో.. ఎటూ పాలు పోని పరిస్థితులను ప్రస్తుతం అనేక మంది ఎదుర్కొంటున్నారు. ఇటువంటి వారికోసం రామకృష్ణ సేవా సమితి దాతల సహకారంతో చొప్పదండిలో నిరాశ్రయుల కర్మకాండ వసతి గృహాన్ని నిర్మించి, నిర్వహిస్తుంది. సొంత ఇల్లు లేని అనేక మందికి కర్మకాండ భవనంలో ఆశ్రయం కల్పించింది.

రామకృష్ణ పరమహంస ప్రేరణ, స్వామి వివేకానంద బోధనలు, రచనలకు ప్రభావితమై 2013లో చొప్పదండి కేంద్రంగా రామకృష్ణ సేవా సమితిని ఏర్పాటు చేశారు. నిరుపేద కుటుంబంలో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియల నిర్వహణ కోసం ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సేవా సమితి అందజేస్తోంది. కొవిడ్ కాలంలో మరణాలు సంభవించిన సమయంలో కర్మకాండలు నిర్వహించడం కష్టతరంగా మారడంతో నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహం నిర్మాణం కోసం రామకృష్ణ సేవా సమితి ముందుకు వచ్చింది. చొప్పదండికి చెందిన పారుపెల్లి లక్ష్మి, వెంకటి జ్ఞాపకార్థం వారి కుమారుడు భవన నిర్మాణం కోసం 35 లక్షల రూపాయల విరాళాన్ని అందజేశారు. నిరాశ్రయుల కర్మకాండల వసతి గృహన్ని చొప్పదండిలో శివ కేశవ ఆలయ సమీపంలో నిర్మించారు. నిర్వహణ కోసం మరో ఆరు లక్షల రూపాయలను సేవా సమితి సేకరించింది.

● నాలుగు గదులు.. 11 రోజులు ఆశ్రయం

వసతి గృహంలో నాలుగు గదులను ఏర్పాటు చేయగా నాలుగు కుటుంబాలు ఆశ్రయం పొందవచ్చు. ఒక్కో కుటుంబం 11 రోజుల నుంచి నెల రోజుల వరకు ఆశ్రయం పొందుతున్నారు. తాగు నీటితో పాటు వంట చేసుకోవడానికి అన్ని ఏర్పాట్లు గదుల్లో ఉన్నాయి. నిరుపేదలకు అవసరమైతే నిత్యావసర వస్తువులను సేవా సమితి అందజేస్తుంది. చొప్పదండితో పాటు పొరుగు మండలాల నుంచి ఆశ్రయం కోసం అనేక మంది ఈ వసతి గృహంలో ఆశ్రయం పొందుతున్నారు. అంత్యక్రియల తరువాత మూడో రోజు నుంచి 11వ రోజు వరకు అన్ని కర్మలు నిర్వహించేందుకు వసతి గృహంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

దాతల సహకారంతో మర్ని వసతులు

- చెట్ల రాంకిషన్(గౌరవ అధ్యక్షుడు, రామకృష్ణ సేవా సమితి)



నిరాశ్రాయుల కర్మకాండ వసతి గృహం నిరుపేదలకు అండగా నిలుస్తుంది. దాతల సహకారంతో మరిన్ని వసతులను కల్పించేందుకు కృషి చేస్తాం.



కర్మకాండ భవనం



కర్మకాండ భవనంలో సహపంక్తి భోజనాలు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ జి రాము అన్నారు. పట్టణంలోని రాంనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కాన్సియస్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం సీఐ రాము మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మత్తు పదార్థాల బారినపడి చేజేతులా భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, చైల్డ్ కేఫ్, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది రమేష్, సంపత్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, జగన్, సారిక తదితరులు పాల్గొన్నారు.

శిఖం భూములను కాపాడాలి



అర్‌ఐ ప్రవీణ్‌తో వాగ్వాదం చేస్తున్న తండా వాసులు

వీర్నపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చెరువు శిఖం భూములను కాపాడాలని వీర్నపల్లి మండలంలోని వన్ పల్లి కేలోత్ తండా గ్రామస్థులు గురువారం ఆందోళనకు దిగారు. సర్వే కోసం తండాకు వచ్చిన ఆర్‌ఐ ప్రవీణ్‌తో వాగ్వాదానికి దిగారు. భూములు కబ్జాకు గురవుతున్నాయని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువుకు సంబంధించిన భూమికి ఎలా పట్టాలిస్తారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించాలని, భూమిని ఆక్రమించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని తండా వాసులను అక్కడి నుంచి పంపించారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యం

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 48 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాంమో హన్ తెలిపారు. గురువారం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామం నుంచి మినీవ్యాన్‌లో బియ్యం తరలిస్తున్నరనే సమాచారంతో తంగళ్లపల్లి పోలీసులు, జిల్లా టాస్కుఫోర్సు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 48 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని తరలిస్తున్న, కోనుగోలు చేస్తున్న జిల్లెలకు చెందిన గాండ్ల నితిన్, పాండు, రాజు, గుగు లోతు అంగుర నెరెళ్ల గ్రామానికి చెందిన డ్రైవ ర్లు శ్రీను, ప్రశాంత్‌తోపాటు వేములవాడ మండలం వట్టిముల గ్రామానికి చెందిన సముద్రాల ప్రశాం త్‌పై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో టాస్కుఫోర్సు ఎస్సై సుధాకర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఓ వృద్ధురాలు ప్రమాదవశాత్తు బావిలో పడి మరణించిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. నారాయణపూర్ గ్రామానికి చెందిన ముత్యాల పోచమ్మ(81) కళ్లు సరిగా కనబడకపోవడంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని తీయించి పోస్టుమార్టం నిమిత్తం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం



చెగ్యాంలో మాట్లాడుతున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు గ్రామం చెగ్యాం నిర్వాసితులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రూ.18 కోట్ల ముంపు నష్ట పరిహారానికి సంబంధించిన మిగులు చెక్కులను గురువారం మండలంలోని చెగ్యాం గ్రామంలో ఎంపీ గడ్డం వంశీతో కలిసి నిర్వాసితులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితులకు సంబంధించి మిగిలిన 63 మంది లబ్ధిదారుల నష్టపరిహారానికి చెందిన చెక్కులను ఎంపీ వంశీతో కలిసి పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో తాను బాధితులకు పరిహారం ఇప్పిస్తానని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలు భూములను కోల్పోయినప్పటికీ పరిహారం అందించే విషయంలో గత బీఆర్ఎస్ నాయకులు పట్టించుకోలేదని తెలిపారు. చెగ్యాం గ్రామాన్ని ముంపు ప్రాంతంగా ప్రకటించడంలో దివంగత కాక వెంకటస్వామి పాత్ర ఎంతో ఉందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ముంపు బాధితుల పరిహారం కోసం చేసిన ప్రతీ నిరసనలో, ధర్నాలో వారి వెంట ఉండి ధైర్యాన్నిచ్చామని గుర్తుచేశారు. అర్హత ఉండి పరిహారం అందని వారు ఇంకా ఎవరైనా ఉంటే వారికి కూడా పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుం టామని తెలిపారు.

● భూ నిర్వాసితుల కలనెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం

చెగ్యాం భూ నిర్వాసితుల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ పేర్కొన్నారు. తన తాత వెంకటస్వామి హయాంలో రూపకల్పన చేసిన ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిహారం చెక్కుల పంపిణీలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్లంపల్లి భూ నిర్వాసితులకు న్యాయం చేయలేదన్నారు. ప్రభుత్వం కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమం గురించి ఆలోచిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ శేఖర్, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని రుణం ఇవ్వండి

- బ్యాంక్ మేనేజర్‌కు మాజీ సర్పంచ్ భర్త వినతి

మేడిపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యాలయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు రుణం ఇవ్వాలని ఓ మాజీ సర్పంచ్ భర్త దక్కన్ గ్రామీణ బ్యాంక్ (డీజీబీ) మేనేజర్‌కు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని తొంబర్రాపేట గ్రామానికి చెందిన మామిడి సత్తమ్మ-ధర్మారెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో అప్పులు చేసి గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు చేశారు. గత సంవ త్సరం ఉపాధి హామీ నిధులు 20 లక్షల రూపా యలతో గ్రామపంచాయతీ భవన నిర్మాణా నికి ప్రతిపాదనలు చేశారు. 18 లక్షల రూ పాయలు వెచ్చించి భవనాన్ని నిర్మించారు. ఇంకా కొంత పని చేయాల్సి ఉంది. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరిగాడు. వారం రోజుల క్రితం 7.46 లక్షల రూపాయలు విడుదలయ్యాయి. మిగతా బిల్లులు రాలేదు. తాను అప్పులు చేసి గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించానని, బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నానని మాజీ సర్పంచ్ సత్తమ్మ భర్త ధర్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నిర్మించిన గ్రామపంచాయతీ కార్యా లయాన్ని తాకట్టు పెట్టుకొని తనకు అప్పు ఇవ్వాలని, ప్రభుత్వం నుంచి బిల్లు రాగానే వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తానని దక్కన్ గ్రామీణ బ్యాంక్ బ్యాంకు మేనేజర్‌కు గురువారం వినతిపత్రం సమర్పించాడు.



బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ సర్పంచ్ భర్త ధర్మారెడ్డి

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఊటూర్ గ్రామంలో గురువారం రాత్రి మానేరు వాగు నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని మానేరు వాగు నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా లారీలతో ఇసుకను తరలించడం వల్ల దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. రోడ్లు అన్ని ధ్వసమవుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్థులతో చర్చించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంభీరావుపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. దేవవ్వ పిల్లలు చదవులు నిమిత్తం హాస్టల్ ఉంటున్నారు. దేవవ్వ భర్త సత్యంకు వైద్యం చేయించేందుకు ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్లింది. రాత్రి ఇంటి తాళాలు పగుల గొట్టిన దొంగలు 2 తులాల బంగారు, 34 తులాల వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు.

ఆభరణాలు తీసుకొని మోసం

- కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒక శుభకార్యానికి వెళ్లేందుకు ఆభరణాలు కావాలని తీసుకుని తిరిగి ఇవ్వకుండా బెదిరింపు లకు పాల్పడిన నిందితురాలిపై కేసు నమోదు చేశామని కరీంనగర్ మూడో టౌన్ పోలీసులు తెలిపారు. బ్యాంక్ కాలనీకి చెందిన చెన్నమల్ల లక్ష్మి వద్ద అక్టోబరు 21న అదే ప్రాంతానికి చెందిన మడనాటి అరుణ 4 తులాల బంగారు ఆభరణాలు, 15తులాల వెండి గొలుసులను తీసుకుని శుభకార్యం తరువాత తిరిగి ఇస్తానని నమ్మబలికిందని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన బంగారు, వెండి ఆభరణాలు తిరిగి ఇవ్వాలని బాధితురాలు కోరగా బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

వెల్గటూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బండమీది రాజమణి (56) అనే మహిళ గురువారం ఫిట్స్ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజమణి పుట్టుకతో ఫిట్స్ వ్యాధితో బాధపడుతోంది. వివాహం అయినప్పటికీ ఫిట్స్ వ్యాధి కారణంగా విడాకులు అయ్యాయి. అప్పటి నుంచి తల్లి గౌరమ్మ దగ్గర ఉంటోంది. కాగా గురువారం మంచి నీటి కోసం ఇంటి వెనుక గల బావి దగ్గరుకు వెళ్లింది. ఎంతసేపైనా రాకపోయే సరికి చుట్టుపక్కల వెతికారు. అనుమానం వచ్చి పాతాళగరిగెతో బావిలో వెతకగా ఆమె మృతదేహం బయటపడింది. రాజమణి తల్లి గౌరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల కార్డన్‌సెర్చ్

కోల్‌సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పట్టణంలోని గంగానగర్ ఏరియాలో గురువారం వన్‌టౌన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి నేతృత్వంలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, వివరాలను తెలుసుకున్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి జరమానాలు విధించారు. 13 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని వాటి యజమానుల వివరాలు తెలుసుకుని వారికి అప్పగించారు. గంగానగర్ ఏరియాలో అనుమానితులు కనబడితే సమాచారం ఇవ్వాలని, అపరిచితులకు ఆశ్రయం కల్పించవద్దని సీఐ ఇంద్రసేనారెడ్డి స్థానికులకు సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్ ద్వారా మోసాలు చేసే అవకాశాలు ఉన్నందున అపరిచిత ఫోన్‌కాల్స్‌కు బ్యాంక్ ఖాతాల, ఓటీపీ, ఏటీఎం నంబర్లు వంటివి చెప్పవద్దని సూచించారు. ఈ కార్డన్‌సెర్చ్‌లో ఎస్సైలు, కానిస్టేబుళ్లు సిబ్బంది పాల్గొన్నారు.



గోదావరిఖనిలో వివరాలు తెలుసుకుంటున్న సీఐ ఇంద్రసేనారెడి



కేసీఆర్‌నగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

తంగళ్లపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్‌నగర్‌లో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానిత వ్యక్తులు తదితర అంశాలపై ఆరా తీశారు. ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. టెక్స్‌టైల్ పార్కు గేట్ వద్ద తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లడుతూ అను మానిత వ్యక్తులు సంచరించినా, అసాంఘీక కార్యక్ర మాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థలు వినియోగించినా, విక్రయించినా వారి వివరాలు పోలీసులకు అందించాలని సూచించారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. యువత వ్యసనాల బారిన పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సీఐ మొగిలి, ఎస్ఐ రాంమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

శంకరపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో పాముకాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంగల దేవి (41) అనే మహిళ ఈ నెల 4న ఉదయం పాడి ఆవును మేతకు వ్యవసాయ పొలం వద్దకు తీసుకెళ్తుండగా కుడికాలుపై పాముకాటు వేసింది. దేవి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు తెలుపడంతో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు జమ్మికుం టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి తిరిగి హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి గురువారం ఉదయం తీసుకువచ్చారు. డాక్టర్ పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దేవి భర్త వెంగల కుమార స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ యువకుడు..

ఓదెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం గ్రామానికి చెందిన గ్యారవేణి శ్రీనివాస్ (40) అనే యువకుడు గురువారం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందాడు. వారం క్రితం శ్రీనివాస్ హరిపురం నుంచి కొలనూర్ వైపు వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు గుర్తించి హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోగంపాడు గ్రామానికి చెందిన జిల్లెల మల్లారెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. మల్లారెడ్డి తన స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి సీతంపేట గ్రామానికి చెందిన చిలుక అజయ్ తన బైక్‌ను అతి వేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి ఢీకొట్టాడు. మల్లారెడ్డి కింద పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మల్లారెడ్డి కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

అప్పులు ఇచ్చిన వారి వేధింపులు భరించలేక
తల్లీకూతుళ్ల ఆత్మహత్యాయత్నం

ముస్తాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అప్పుల ఇచ్చిన వారి వేధింపులు తాళ లేక తల్లీకూతుళ్లు ఆత్మహత్యకు యత్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని మోర్రాయిపల్లెకు చెందిన గుండం బాలమల్లు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. బాలమల్లు అనారోగ్యంతో ఉన్నప్పుడు రూ. 20 లక్షల వరకు అప్పులు చేశాడు. అతడు మరణించిన తర్వాత అప్పులు తీర్చాలని అతడి భార్య మంజుల, కూతురు అఖిలను అప్పులు ఇచ్చిన వారు వేధిస్తున్నారు. గురువారం ఉదయం వారి ఇంటికి వచ్చి ఇష్టారీతిన మాట్లాడంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఉరేసుకున్నారు. గమనించిన స్థానికులు తలుపులు బలవంతంగా తెరిచి వెంటనే వారిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తల్లి మంజుల ప్రాణాపాయ స్థితి నుం చి బయటపడింది. అఖిల పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

డబ్బులు ఇస్తానంటూ మోసం

- పోలీసులకు అప్పగించిన గ్రామస్థులు



నిందితుడిని చెట్టుకు కట్టేసిన గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగడపల్లిలో ఓ గుర్తుతెలియని వ్యక్తి డబ్బులు ఇస్తానంటూ మోసానికి పాల్పడ్డాడు. గ్రామంలో కిరాణా షాపు నడుపుతున్న సుమలత అనే మహిళ వద్దకు గురువారం వెళ్లి ఎస్సీ కాలనీ దగ్గర ఇల్లు ఉంటుందని, 50వేల రూపాయలు ఫోన్ పే చేస్తే డబ్బులు ఇస్తానంటూ నమ్మబలికాడు. దీంతో ఆమె డబ్బులు పంపగా, మరో 30 వేలు పంపాలని కోరాడు. ఆమె తన వద్ద డబ్బులు లేవని చెప్పినా వినకపోవడంతో ఆమె పోలీసులు, గ్రామస్థులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల వారు వచ్చి అతడిని నిలదీయగా ఆ డబ్బులు వేరే నంబర్‌కు ఎళ్లాయని, తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో పాటు తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో గ్రామస్థులు అతడిని చెట్టుకు కట్టేశారు. పోలీసులు నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇబ్రహీంపట్నం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండలింగాపూర్ శివారులో గురువారం జాతీయ రహదారి పక్కన ఉన్న బావిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. రహదారి పక్కన ఉన్న బావిలో వ్యక్తి దాదాపుగా 30 నుంచి 40 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. మృతుడి ఒంటిపై బూడిద కలర్ టీ షర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తుపట్టిన వారు మెట్‌పల్లి సీఐ 8712656819, ఇబ్రహీంపట్నం ఎస్ఐ 8712524667 నంబర్లను సంప్రదించాలని ఎస్ఐ అనిల్ కోరారు.

మున్సిపల్ ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

- ఆరుగురు పారిశుధ్య కార్మికులకు గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం

కోరుట్ల, నవంబర్ 7(ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో విధులు నిర్వహించాడానికి మున్సిపల్ ట్రాక్టర్‌లో వెళ్తున్న పారిశుధ్య కార్మికుల ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు గురువారం ఉదయం ఢీ కొట్టింది. బోధన్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను ఢీ కొట్టగా ఘటనలో ఆరుగురికి గాయలుకాగా ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మున్సిపల్‌లో విధులు నిర్వహిస్తున్న రాగుల కనకతార, బొల్లె కార్తీక్, బైరి రాధ, సుగుణ, గంగు, రేణుకకు గాయాలు అయ్యాయి. ఇందులో కనకతార, కార్తీక్ పరిస్థితి విషమంగా ఉంది. కాగా రాగుల కనకతార ప్రస్తుతం గర్భిణి. పోలీస్‌లు, మున్సిపల్ సిబ్బంది అక్కడకు చేరుకోని గాయాలపాలైన కార్మికులను జగిత్యాల ప్రభుత్వ అసుపత్రికి తరలించారు.

అదుపు తప్పి కారు బోల్తా



బోల్తా పడిన కారు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని గురువారం కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో యువకుడికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని రాజన్నపేటకు చెందిన తేజక గొల్లపల్లి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు టైర్ పగిలి ప్రమాదానికి గురైందని స్థానికులు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, నవంబరు7(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో కంఠం సరళ అనే వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో, హెడ్‌కానిస్టేబుల్ సత్యానారాయణ గురువారం తెలిపారు. గ్రామంలోని నర్సయ్య పెద్ద కూతురు సరళకు అదే గ్రామానికి చెందిన ఉదయ్‌తో 2013లో వివాహమైంది. నర్సయ్యకు కొడుకు లేకపోవడంతో కూతురు సరళ, అల్లుడు ఉదయ్ అతడి వద్ద ఉంటూ జీవిస్తున్నారు. ఈ నెల 6న సరళ రాత్రి వంట చేయకపోవడంతో తండ్రి నర్సయ్య మందలించాడు. దీంతో ఆమె ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. చుట్టు పక్కల, బంధువుల వద్ద గాలించిన ఆచూకీ లభించలేదని తెలిపారు. బాధితుడు నర్సయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ వివరించారు.

కొనసాగుతున్న గోదావరి హారతి



ధర్మపురి వద్ద గోదావరి హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో ఆరో రోజు గురువారం గోదావరి హారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు గోదావరి నది వద్ద విశేష పూజలు జరిపారు. అనంతరం రాత్రి నదీ మాతకు హారతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, వేదపండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి, నరసింహమూర్తి, ఆలయ అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు అరుణ్‌కుమార్, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, నవీన్, మోహన్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో కొనసాగుతున్న కార్తీక రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో కార్తీక రద్దీ కొనసాగుతోంది. గురువారం రాజన్న ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఆలయ ముందు భాగంలోని రావిచెట్టు ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకొని పార్వతీ పరమేశ్వరు లను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించు కున్నారు. అనంతరం గండ దీపంలో నూనె పోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు.

చదరంగంతో ఆలోచనా శక్తి పెంపు



చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో ఆలోచనా శక్తి పెంపొందుతుందని డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ అన్నారు. ఎస్‌జీఎఫ్ అండర్-17, అండర్-14 బాల బాలికల ఉమ్మడి జిల్లా చదరంగ పోటీలు గురువారం జీనియస్ చెస్ అకాడమీలో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వేణుగోపాల్ మొదటి ఎత్తు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదరంగంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శంకరయ్య, జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్ కంకటి అనూప్ కుమార్, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రావు, సృజన్‌కుమార్, సతీష్‌బాబు, చీఫ్ ఆర్బిటర్ తరుణ్, ఆర్బిటర్లు, రేవిక్, నితిన్, శ్రీనిజ, పీఈటీలు పాల్గొన్నారు.

పాడితో లాభాలు

- డెయిరీల ఏర్పాటుతో స్వయం ఉపాధి
- మేలైన జాతి ఆవులు, గేదెలతో మంచి పాల దిగుబడి

రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడి పశువులను పెంచుతూ అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. మేలైన పశువులను ఎంచుకుని మంచి పాల దిగుబడిని సాధిస్తున్నారు. పాలను తామే అమ్ముకుంటూ లాభాలు సాధిస్తున్నారు. సైదాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో యువకులు, రైతులు పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు.

◆ సైదాపూర్



అనిల్ డెయిరీ ఫామ్‌లో ఆవులు



ఆవులకు వేసేందుకు గడ్డిని చిన్న చిన్న ముక్కలు కట్ చేస్తున్న అనిల్

■ జాగీర్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పార్ల అనిల్ అనే యువకుడు డిగ్రీ పూర్తి చేశాడు. తల్లితండ్రులను వదిలి ఎక్కడికో ఉద్యోగం చేయడానికి వెళ్లడం ఎందుకు అని ఆలోచించి డెయిరీ ఫామ్ పెట్టుకున్నాడు. కేడీసీసీ బ్యాంక్ నుంచి 20 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి 14 పాడి ఆవులు, ఒక గేదెను తీసుకొచ్చాడు. వాటికి షెడ్డు ఏర్పాటు చేసి తమ వ్యవసాయ భూమిలో గడ్డిని పెంచుతూ మేతగా ఇస్తున్నాడు. డెయిరీ ఫామ్‌లో తనకు సహాయంగా బిహార్‌కు చెందిన ఓ యువకుడిని జీతంగా పెట్టుకున్నాడు. వీరిద్దరు ప్రతి రోజు ఆవుల పోషణ చూస్తూ పాలు పితుకుతూ మార్కెట్‌కు పంపిస్తారు. అనిల్ ప్రస్తుతం నెలకు ఖర్చులు పోను 60 వేల రూపాయల వరకు సంపాదిస్తున్నాడు. పశువుల ద్వారా వచ్చిన ఎరువును భూమిలో వేసుకుంటున్నాడు.

సంతృప్తిగా ఉంది.

- ఉప్పారపు అనీల్, యువ రైతు, జాగీర్‌పల్లి



ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఇబ్బంది పడడం కన్నా సొంతగా డెయిరీ ఫామ్ నడుపుకోవడం సంతృప్తిగా ఉంది. ప్రస్తుతం 15 పాడి పశువులను పెంచుతున్నాను. అన్ని ఖర్చులు పోనూ నెలకు 70వేల వరకు మిగులుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య సొంత ఊరిలో పని చేసుకోవడం సంతృప్తిగా ఉంది.



డెయిరీఫామ్‌లో రవీందర్ రెడ్డి

■ మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చెప్యాల రవీందర్ 13 గేదెలతో, తాటిపెల్లి సీతారాం 12 గేదెలు, ఆవులతో డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నారు. వీరు ఆరు సంవత్సరాలుగా పశు పోషణ చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. చెప్యాల రవీందర్ సైదాపూర్ మండల కేంద్రంలో ఓ గదిని తీసుకుని తమ ఫామ్ నుంచి వచ్చిన పాలను అమ్ముతున్నాడు. ఖర్చులు పోను నెలకు 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయని వారు అంటున్నారు. వ్యవసాయంతోపాటు డెయిరీ ఫామ్ నడపడం వల్ల లాభదాయకంగా ఉందని వారు తెలిపారు. పని వాళ్లపై భారం వేయకుండా యజమానులు దగ్గరుండి పశువులను చూసుకుంటే మంచి లాభాలు సాధించవచ్చని వారంటున్నారు.

లోకల్‌గా పాలు అమ్మితే లాభాలు వస్తాయి

- చెప్యాల రవీందర్‌రెడ్డి, డెయిరీ ఫామ్ నిర్వాహకుడు, దుద్దెనపల్లి



నేను 13 సంకర జాతి గేదెలను తెచ్చి ఆరు సంవత్సరాలుగా డెయిరీ ఫామ్ నిర్వహిస్తున్నాను. మంచి లాభాలు వస్తున్నాయి. పెట్టిన పెట్టుబడి పూర్తిగా వచ్చింది. సైదాపూర్ మండల కేంద్రంలో రూం తీసుకొని ప్రతీ రోజు ఉదయం ఏడు గంటల వరకు గేదె పాలు అమ్ముతున్నాను. మంచి లాభం వస్తుంది. ప్రతీ నెల ఖర్చులు పోను 50 వేల రూపాయల వరకు మిగులుతున్నాయి.

న్యూస్ బాక్స్

రూ.6,900 పలికిన పత్తి ధర

జమ్మికుంట, నవంబర్ 07 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,900 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 128మంది రైతులు 1,239క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు 13క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,900, కనిష్ఠ ధర 6,200 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

డీఎస్పీల బదిలీ

కరీంనగర్ క్రైం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పలువురు డీఎస్పీల బదిలీలు జరిగాయి. ఈ మేరకు డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల డీసీఆర్‌బీలో పనిచేస్తున్న డీఎస్పీ జి మహేష్‌బాబును కరీంనగర్ పీటీసీ డీస్పీగా బదిలీ చేశారు. అలాగే కరీంనగర్ పీటీసీలో పనిచేస్తున్న బి రామానుజంను ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డీఎస్పీగా బదిలీ చేశారు. కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆసిఫాబాద్ డీఎస్పీగా, ఆసిఫాబాద్ డీఎస్పీ పి సదయ్యను హైదరాబాద్ చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిర్మల్ డీసీఆర్‌బీ డీఎస్పీగా పనిచేస్తున్న పి రవీందర్‌రెడ్డి ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా బదిలీ చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని మరికొందరు ఏసీపీలకు త్వరలో బదిలీలు జరుగను న్నట్లు సమాచారం. ఇందులో కొందరు ఏసీపీలకు పదోన్నతులు రానున్నాయి.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు సైనిక స్కూల్ విద్యార్థుల ఎంపిక

చొప్పదండి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రుక్మాపూర్ సైనిక స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. అండర్-17 విభాగంలో స్వరూప్, నరేష్, విజయ్‌కుమార్, అరవింద్, రాంసుధీర్, వర్షిత్‌కుమార్ ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో శ్రీసాయి, అజయ్, పునీత్ చంద్ర, చంద్రశీల, శశివదన్, మహేష్, సాహు మహారాజ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు.

ఆలయ హుండీ లెక్కింపు

మానకొండూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గట్టుదుద్దెనపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. హుండీ ద్వారా 2.42.389 రూపాయల ఆదాయం వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి మారుతి తెలిపారు.

డెడికేషన్ కమిటీ ఏర్పాటు హర్షణీయం


- వెనుకబడిన వర్గాల్లో ఆశలు చిగురింపజేస్తున్న కులగణన సర్వే - ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా వెనుకబాటుతనానికి గురైన బీసీలకు రాజ్యాంగబద్ధంగా కల్పించాల్సిన రిజర్వేషన్ సౌకర్యాల కోసం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బలహీన వర్గాల అభ్యున్నతిలో భాగంగా రాజ్యాంగబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం డెడికేషన్ కమిటీ వేసిందన్నారు. బలహీన వర్గాలకు స్థానికసంస్థల్లో రిజర్వేషన్ల కల్పనకు ఉమ్మడి రాష్ట్రంలోనే చట్టం రూపొందించారన్నారు. 2004లో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఆలోచ నలకు అనుగుణంగా అల్పసంఖ్యాక వర్గాలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారన్నారు. బలహీన వర్గాల న్యాయం చేయాలనే తలంపుతోనే రాహుల్ గాంధీ వివరాలు సేకరించేందుకు సర్వే చేయాలని ఆదేశించారన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లోనే కులగణన అంశం ప్రస్తావించడంతో ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సర్వేతో ప్రజలకు ఇబ్బం దులు కలగకుండా చూడాలని సీఎంకు లేఖ రాశానని అందులో సర్వే చేసే రోజు సమాచారం ఉండేలా చూడాలని కోరానన్నారు. కొందరికి ఇంటి నంబర్లు లేక బయట గుడిసెలు వేసుకోని ఉన్నారని, కొందరు సంచార జాతులు కూడా ఉన్నారని అలాంటి వారిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి స్పష్టమైన వివరాలు సేకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం 2014లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే నేటికీ బహిర్గతం కాలేదన్నారు. ప్రజాసంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత, చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. పనిచేసే ప్రభుత్వంపై అక్కసుతోనే ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సహజం అన్నారు. నవంబరు నెలలోనే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని, గ్రామసభల ద్వారా అర్హులను ఎంపిక చేసి నిర్ణయం తీసుకుంటారన్నారు. సర్వేపై ప్రజలు ఆపోహలు పడొద్దని, ఆందోళన చెందవద్దని కోరారు. సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవ న్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, టీపీసీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బండ శంకర్, మండల బ్లాక్ ప్రెసిడెంట్ నందయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మాజీ ఎంపీపీ రమేష్, మాజీ కౌన్సిలర్లు గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నాయకులు నెహాల్, చాంద్‌పాషా, గుండా మధు, విజయ్, మహేష్ తదితరులు ఉన్నారు.





శ్రీనివాస్ వేసిన చిత్రాలు

ఊహో చిత్రం.. కళాత్మకం

చిన్నప్పటి నుంచి ఆ యువకుడికి చిత్రకళ అంటే ఆసక్తి. గీసిన ప్రతీ చిత్రంలో జీవం ఉట్టిపడుతుంది. ప్రకృతి రమణీయతతోపాటు ఊహల్లోని చిత్రాలకు ప్రాణం పోస్తాడు. తనలోని ప్రతిభనను సానపట్టాలనుకొని ఫైన్ ఆర్ట్స్‌లో చేరాడు. పలు ప్రాంతాల్లో ఆర్ట్స్ గ్యాలరీలు ఏర్పాటు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు.

- చిత్రకళలో రాణిస్తున్న రుద్రంగి యువకుడు
- స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీల్లో ప్రదర్శనలు

రుద్రంగి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మనసులో మెదిలే భావాలకు తన కుంచెతో ప్రాణం పోస్తున్నాడు రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మంచె శ్రీనివాస్. చిన్నతనం నుంచి శ్రీనివాస్‌కు చిత్రకళ అంటే ఇష్టం. దానినే ఉపాధిగా మల్చుకోవాలనుకున్నాడు. గురువు ఎలిగేటి నరేష్ వద్ద మెళకువలు నేర్చుకున్నాడు. హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయంలో మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ పూర్తి చేశాడు. లైవ్ ల్యాండ్ స్కేప్స్ పెయింటింగ్స్‌లో ప్రతిభ చాటుతున్నాడు. ముఖ్యంగా, పాత కాలపు కట్టడాలు, గ్రామీణ జీవితాన్ని ప్రత్యక్షంగా చిత్రించడం ద్వారా ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. పల్లెలోని జీవన శైలి, గ్రామీణుల సంప్రదాయాలు శ్రీనివాస్ చిత్రాల్లో ప్రతిబింబిస్తాయి. పల్లె జీవన సౌందర్యాన్ని సమకాలిన ప్రపంచానికి పరిచయం చేస్తున్నాడు. ప్రస్తుతం అబ్‌స్ట్రక్ట్ పెయింటింగ్‌లో శ్రీనివాస్ రాణిస్తున్నాడు. శ్రీనివాస్ వేసిన చిత్రాలను ఆర్ట్స్‌గాలరీలో ప్రదర్శిస్తున్నాడు. సొంత ఖర్చులతో 2017లో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో స్టేట్ ఆర్ట్స్ గ్యాలరీలో సుమారు 85 చిత్రాలను ప్రదర్శించాడు. 2019లో అవిష్కృ పేరిట హైదరాబాద్‌లోని కళాకృతి ఆర్ట్స్ గ్యాలరీలో మరోసారి ప్రదర్శించాడు. 2023లో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఆర్ట్స్ గ్యాలరీలో క్యాంపస్ డైరీస్ పేరిట 30 చిత్రాలను ప్రదర్శించాడు. రాష్ట్ర, జాతీయస్థాయి ఆర్ట్స్‌గాలరీల్లోనూ శ్రీనివాస్ చిత్రలాను ప్రదర్శించాడు. ఆర్ట్స్‌గాలరీల్లో శ్రీనివాస్ వేసిన చిత్రాలు నచ్చినవారు వాటిని కొనుగోలు చేయడంతో ఆదాయం పొందుతన్నాడు. వీటితోపాటు హోటళ్లు, ఆస్పత్రుల నుంచి అర్డర్లు పొదుతున్నాడు.



హైదారాబాద్‌లో జరిగిన ఓ ప్రదర్శనలో తన పెయింటింగ్‌లను చూపుతున్న శ్రీనివాస్

అంతర్జాతీయస్థాయిలో చిత్రాలను ప్రదర్శించాలి

- మంచె శ్రీనివాస్, చిత్రకారుడు, రుద్రంగి.



ప్రస్తుతం రాష్ట్ర, జాతీయ స్థాయి ఆర్ట్స్‌గాలరీల్లో చిత్రాలను ప్రదర్శించాను. అక్కడ మంచి గుర్తింపు వచ్చింది. అంతర్జాతీయస్థాయిలో ఆర్ట్స్‌గాలరీల్లోనూ చిత్రలాను ప్రదర్శించాలి. నా చిత్రాల్లో సామాజిక సమస్యలు, వ్యక్తిగత భావాలను చేరుస్తున్నాను. ప్రతీ కళ సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. వ్యక్తిగత మానసికతను మారుస్తుంది.

నీటి కోసం ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న మహిళలు

వైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 7: నీటి కోసం ఖాళీ బిందెలతో కాలనీ హనమాన్‌నగర్ మహిళలు గురువారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. తమ ప్రాంతానికి కార్పొరేషన్, సింగరేణి నీళ్లు వచ్చేవని, వారం రోజులుగా సింగ రేణి పూర్తిగా నీటి సరఫరాను నిలిపివేసినట్టు మహిళలు తెలిపారు. రోజు విడిచి రోజు వచ్చే మిషన్ భగీరథ నీళ్ళు సైతం మూడు రోజులుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికేతర వాడలకు సింగరేణి నీటి సరఫరా నిలిపివేయడం సరికాదని, యథావిధిగా నీటి సరఫరా చేయాలని మహిళలు డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల పరిశీలకుడిగా శ్రీను

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 7: రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్ జి.శ్రీను నియమితులయ్యారు. సిద్ధిపేట జిల్లాలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం కోరపల్లి జడ్పీహెచ్‌ఎస్ పీడీ శ్రీనును అబ్జర్వర్‌గా నియమిస్తూ రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రామ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీను రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణ, మైదానాలు, సదుపాయాలు తదితర విషయాలను పరిశీలించి నివేదికను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నివేదించాల్సి ఉంటుంది. రాష్ట్ర పరిశీలకుడిగా శ్రీను ఎంపిక పట్ల జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం టీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, మహమ్మద్ యూనిస్‌పాషా, సీనియర్ పీడీలు సంపత్‌రావు, కే కృష్ణ, బాబు శ్రీనివాస్, గిన్నె లక్ష్మణ్ తదితరులు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు ఆసిఫ్‌నగర్ విద్యార్థి ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

భగత్‌నగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు కొత్తపల్లి మండలం లోని ఆసిఫ్‌నగర్ విద్యార్థి గుగులోతు అనిత ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రధా నోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో వ్యా యామ ఉపాధ్యాయుడు శ్రీనివాస్, వాసంతి, శివకుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజెలీన్, గంగాచారి, నాగవేణి, హరికృష్ణశర్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పేద విద్యార్థికి అలయన్స్ క్లబ్ ఆర్థిక చేయుత

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అగ్నిపథ్ ఎగ్జామ్ క్వాలిఫై అయ్యి, ఫిజికల్ ఫిట్నెస్ కోసం డిఫెన్స్ అకాడమిలో చేరడానికి ఆర్థిక స్థోమత లేని పేద విద్యార్థికి అలయన్స్ క్లబ్ సభ్యులు అండగా నిలిచి 5వేల రూపాయల ఆర్థికసహాయాన్ని అందించారు. మండలంలోని జక్కన్నపల్లికి చెందిన పగిడి గణేష్ కూలి పని చేసుకుంటూ కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఇటీవల అగ్నిపథ్ పరీక్షలో అర్హత సాధించి, ఫిజికల్ ఫిట్నెస్ సాధించడం కోసం ఆర్థిక స్థోమత లేక గణేష్ ఇబ్బంది పడుతున్నాడు. జాతీయ క్రీడా శిక్షకులు మేకల సంజీవరావు క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకురాగా వారు స్పందించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అల్లై మామిడిశెట్టి శ్రీనివాస్, ఎలగందుల అశోక్, ఎలిగేటి మహేందర్, తోడేటి మురళిగౌడ్, బైరి చంద్రమౌళి, ఎండి బాబా, మల్యాల సత్యనారాయణ, సాయినాథ్ చారి, కనగర్తి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడి నియామకం

ధర్మారం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండల బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులుగా ఖిలావనపర్తి గ్రామానికి చెందిన సాగంటి కొండయ్యను నియమిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కొండయ్య మట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్‌తో పాటు ఓరుగంటి భార్గవ రామ్, కొమ్మస్వామి, ముత్యాల వీరస్వామి, సాగంటి నర్సయ్యలకు కొండయ్య క్రుతజ్ఞతలు తెలిపారు.

ప్రియుడి ఇంటి ఎదుట యువతి బైఠాయింపు

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కునారం గ్రామానికి చెందిన యువతి అదే గ్రామానికి చెందిన జంగిటి అనిల్ నాలుగు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. ఎన్నిసార్లు వివాహ ప్రస్తావన తీసుకువచ్చినా అనిల్ నిరాకరించడంతో గురువారం అతడి ఇంటి ముందు బైఠాయించి నిరసన తెలిపింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యువతికి నచ్చచెప్పడంతో నిరసన విరమింపచేసింది.

విద్యార్థులకు టై, బెల్టులు ప్రదానం

మంథని, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నర్సింహారావు తన తండ్రి సత్యనారాయణరావు స్మారకంగా విద్యార్థులకు టై, ఐడీ కార్డ్స్, బెల్టులు, రిటైర్డు టీచర్ హరిప్రియ షూలు సమకూర్చగా డీఈవో మాధవి గురువారం ప్రదానంచేశారు. ప్రైవేట్ విద్యార్థులకు దీటుగా హెచ్ఎం నర్సింహారావు తమ విద్యార్థులకు సామగ్రిని అందజేయ డంపై డీఈవో హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యే కంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో డాక్టర్ షేక్, ఎంఈవో లక్ష్మి, పాఠశా ల కమిటీ చైర్మన్ రఫీదేవి, టీచర్లు నరేష్, వామనమూర్తి, నగేష్, శారద తదితరులు పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికులకు మెమోలు

కళ్యాణ్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పనిచేస్తున్న ముగ్గురు పారిశుధ్య కార్మికులకు గురువారం సూపరింటెండెంట్ దయాల్ సింగ్ చార్జ్ మెమోలు జారీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం లేదంటూ వారికి మెమోలు జారీ చేశారు.

విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

కళ్యాణ్‌నగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తిని ఎంచుకున్న విద్యార్థులు విపత్కర పరిస్థితుల్లో ధైర్యంగా ఉండాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం గోదావరిఖనిలోని సింగరేణి వైద్య కళాశాలలో నిర్వహించిన వైట్ కోట్ సేర్మనీకి కలెక్టర్ కోయ శ్రీహర్ష హాజరై ప్రసంగించారు. వైద్యులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా నిర్ధేశించుకున్న లక్ష్యాలను వైట్‌కోట్ సేర్మనీ గుర్తు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. గత రెండున్న సంవత్సరాలుగా మీరు చేసిన కృషి ఫలితంగా ఈ రోజు వైట్ కోట్ సర్మనీలో పాల్గొంటున్నారని, ఇక్కడ విద్యార్థులు వివిధ ప్రాంతాలు, సామాజిక ఆర్థిక పరిస్థితుల నుంచి వచ్చినవారు ఉన్నారని ప్రతి ఒక్కరికి ప్రత్యేకమైన కృషి ఉందన్నారు. సింగరేణి ఇన్స్టూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ మూడు సంవత్సరాలుగా ఉన్నతమైన సేవలందిస్తుందన్నారు. విద్యార్థులకు మెరుగైన సేవలు అందిస్తూ రాష్ట్రంలోనే అత్యుత్తమ వైద్యకళాశాలగా తీర్చిదిద్దే దిశగా కృసి చేస్తున్నారన్నారు. రాబోయే నాలుగున్నర సంవత్సరాలు మీ జీవితంలో చాలా కీలకం కాబోతుందని, అనేకసార్లు నిరుత్సాహపడే పరిస్థితులురావచ్చని, ఒత్తిడి పెరగవచ్చని, ఎటువంటి పరిస్థితుల్లోనూ నమ్మకం, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దన్నారు. సింగరేణి వైద్య కళాశాల నుంచి మొదటి బ్యాచ్‌గా వచ్చే 150 మంది వైద్యులు ప్రపంచంలో ఎక్కడున్న ప్రజలకు ఉత్తమమైన సేవలందిస్తూ కళాశాలకు గర్వకారణంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల యజమానులపై ఈఎంఐల భారం

- జిల్లా కేంద్రంలో ఖాళీగా దర్శనమిస్తున్న నూతన గృహాలు - అద్దెకు వచ్చేవారు లేక వెలవెల - వాయిదాలు చెల్లించేందుకు అప్పులు..

పెద్దపల్లిటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలో ఏ వీధికి వెళ్లినా 'టు-లెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జిల్లా కేంద్రం కావడంతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఈ ప్రాంతానికి సింగరేణి కార్మికులు, చుట్టు పక్కల గ్రామల ప్రజలు పెద్దపల్లిలో ప్లాట్లు కొనుగోలు చేసి పెద్దఎత్తున ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వాటిని అద్దెకు ఇవ్వడం ద్వారా ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీరుతాయని ఆశించారు. అయితే ఇళ్ల యజమానులు ఆశించిన స్థాయిలో పరిస్థితి లేకపోవడంతో అప్పుల పాలయ్యారు. పెద్దపల్లి పట్టణంలో గతంలో 9 వేల పైచిలుకు ఇళ్లు ఉండగా, జిల్లా కేంద్రం అయిన తరువాత మరో 2వేల వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఏరియా, టీచర్స్ కాలనీ, భూంనగర్, క్రిస్టియన్ కాలనీలతో పాటు కొత్తగా వెలసిన కాలనీల్లో చాలా వరకు ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ సింగరేణి ఉద్యోగులు, ప్రభుత్వ టీచర్లు, ఇతర ఉద్యోగులు, రిటైర్ అయినవారు ఒక్కొక్కరు మూడు నుంచి 8 పోర్షన్లు గల బిల్డింగ్‌లను నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఇళ్లలో కేవలం 80 శాతం ఖాళీగా ఉన్నాయి. నాలుగేళ్ళ క్రితం డబుల్ బెడ్‌రూం ఇంటికి అద్దె 6 నుంచి 8వేల రూపాయలు, సింగిల్ బెడ్‌రూం ఇంటికి 4వేల నుంచి 5వేల రూపాయలు ఉండేది. ఇప్పుడు డబుల్ బెడ్‌రూం ఇంటికి 6వేల లోపు, సింగిల్ బెడ్‌రూం ఇంటికి 3 వేల రూపాయలకు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కట్టి మూడు నాలుగేళ్లయినా ఇళ్లు ఖాళీగా ఉండడంతో నెలనెలా బ్యాంకు రుణాలు చెల్లించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయట అప్పులు తెచ్చి రుణాలు కట్టాల్సి వస్తోందని పలువురు ఇళ్ల యజమానులు వాపోతున్నారు. జిల్లా కేంద్రం కావడంతో జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి ఇక్కడ పెద్దఎత్తున ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే ఉద్యోగులతోపాటు వివిధ వర్గాల ప్రజలు ఇక్కడ అద్దెకు ఉండడం లేదు. తాము నివాసముంటున్న ప్రాంతం నుంచి రాకపోకలు జరుపుతున్నారు. ఇక్కడ ఉండేందుకు ఎవరు సుముఖత చూపడడం లేదు. పిల్లల చదువులు, సామగ్రి తరలించడంలో ఇబ్బందులు, తల్లిదండ్రుల బాగోగులు వంటి పలు కారణాల రీత్యా కుటుంబాలతో సహా తరలివచ్చి ఇక్కడ స్థిరపడేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఎలాగోలా ఇబ్బందులు పడుతూ తామే రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో పెద్దపల్లి పట్టణంలో ఆశించిన స్థాయిలో ఇళ్లు అద్దెకు పోవడం లేదు.


పెద్దపల్లి పట్టణంలో టులెట్ బోర్డుతో ఉన్న ఇల్లు

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల తిష్ట : ఏఐవైఎఫ్

కళ్యాణ్‌నగర్,నవంబరు 7(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సమస్యలు తిష్ట వేసుకొని ఉన్నాయని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి మార్కపురి సూర్య అన్నారు. ఛలో సర్కారీ దవాఖాన కార్యక్రమంలో భాగంగా గురువారం గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిని ఏఐవైఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పూర్తిగా విఫలమయ్యారని, వెంటనే కొత్త సూపరింటెండెంట్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని, రోగులకు వాడుతున్న దూదిని, సర్జరీల నుంచి తీస్తున్న దూదిని ఓపెన్‌గా పెట్టడం ద్వారా ఈగలు ముసిరి రోగులతో వచ్చే వారికి కూడా రోగం వచ్చే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. ఓపీ అనంతరం రోగులు ఫార్మసీకి వెళ్తే అక్కడ మందులు లేవంటూ బయట కొనుక్కోవాలని ఉచిత సలహాలు ఇవ్వడం సరికాదని, పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఓపీ రూములలో ఎక్కువగా జూనియర్ డాక్టర్ల పర్యవేక్షణ జరుగుతుందని, సీనియర్ డాక్టర్లు కూడా ఓపీలో కూర్చునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఆర్ఐ స్కాన్ రాసినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే అనేక మంది పేద రోగులు ఆర్థికంగా లేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాదుల శివకుమార్, ఆసాల నవీన్, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదానం

పెద్దపల్లిటౌన్, నవంబరు 7 (ఆంధ్ర్యజ్యోతి) : దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు జన్మదినం సందర్భంగా గురువారం జెండా చౌరస్తాలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సయ్యద్ హబీబుల్లా మస్రత్, సయ్యద్ నసీబుల్లా అబ్బు సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గురువారం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు, దాతలు ఎవరైనా ఉంటే ముందుకురావాలని కోరారు. వివరాల కోసం దారుల్ సొసైటీ ఫోన్ నంబర్లు 9849691884, 998577877లలో సంప్రదించాలని మస్రత్ కోరారు. ఈ కార్యక్రమంలో సారయ్య గౌడ్, కమల్ కిషోర్, జడల సురేందర్, సురేష్ గౌడ్, జగదీష్, బొద్దుపల్లి శ్రీనివాస్, ఎరుకల రమేష్, సుభాష్ అమ్రేష్, ఉప్పు రాజు, శ్రీమాన్ నాజిమ్ సంపత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులు, విద్యార్థినులకు 'మహాలక్ష్మి' వరం

(5వ పేజీ తరువాయి)

పెద్దపల్లి నుంచి మంథని రూట్‌కు, పెద్దపల్లి నుంచి ఫైటింక్లయిన్ కాలనీ రూట్‌కు, పెద్దపల్లి నుంచి కాల్వశ్రీరాంపూర్, ఓదెలకు వెళ్లే రూట్లలో, సుల్తానాబాద్ నుంచి కాల్వశ్రీరాంపూర్, ఓదెలకు వెళ్లే రూట్లలో సరిపడా బస్సులు లేకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి రద్దీగా ఉన్న రూట్లలో అదనపు బస్సులను నడపాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న ప్రతిపక్షాలు

పాలకుర్తి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులను ప్రతిపక్షాలు పక్కతోవ పట్టిస్తున్నాయని మక్కాన్‌సింగ్ సేవా సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాలుకు 500 బోనస్ చెల్లించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ప్రతిపక్షాలు పనికట్టుకొని రైతులను పక్కతోవ పట్టించేందుకు పూనుకోవడాన్ని దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. గురువారం మండలం పరిధిలోని రామరావుపల్లి, బసంత్‌నగర్ విమనాశ్రయం వద్ద వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీడీవో పాల్సాని శశికళ, తహసీల్దార్ ఎం జ్యోతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మనాలి ఠాకూర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో, మిల్లుల్లో కోతలు విధిస్తే సహించేది లేదన్నారు. కేంద్రాల్లో 41 కిలోలు మాత్రమే తూకం వేయాలని హమలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్, కన్నాల పీఏసీఎస్ చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు మల్లెత్తుల శ్రీనివాస్, పర్షవేణి శ్రీనివాస్ యాదవ్, మాజీ ఎంపీటిసిలు పాత భాగ్యలక్ష్మి రవిందర్, దేవనందుల రాజమొగిళి, గిళి, నాయకులు మేర్గు అశోక్, కేశిరెడ్డి భూంరెడ్డి, బోదాసు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పాలకుర్తి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : మండలంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త పట్టుదలతో కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు సోమరపు లావణ్య అన్నారు. గురువారం మండలం పరిధిలోని ఈసాల తక్కళ్లపల్లి గ్రామంలో మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో లావణ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని త్వరగాపూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాలను ప్రతి ఒక్కరికి వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమారపు అరుణ్, బాలసాని మల్లేశం, అప్పాసి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

20న కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): హైదారాబాద్ గాంధీభవన్‌లో ఈనెల 20న నిర్వహించే కాంగ్రెస్ సేవాదళ్ శతాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొట్టం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో గురువారం జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సేవాదళ్ కార్యకర్తలను పెద్దసంఖ్యలో శతాబ్ది ఉత్సవాలకు తరలించాలని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో సేవాదళ్ పెద్దపల్లి జిల్లా ఇంచార్జి, రాష్ట్ర కార్యదర్శి నీలకంఠ వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ పెర్క సంతోష్, రాజ్ కుమార్, మహేష్, గొట్టె లింగయ్య, ఆకుల స్వామి, ప్రసాద్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి

జూలపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేకు మండల ప్రజలు సహకరించి తమ వివరాలను అందించాలని మండల తహసీల్దార్ జక్కని స్వర్ణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సమగ్ర ఇంటింటి సర్వేను ఎంపీడీవో పద్మజతో కలిసి తహసీల్దార్ స్వర్ణ సర్వేను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే కోసం గ్రామాల్లోకి వచ్చే ఎన్యూమరేటర్లు అడిగే వాటికి వివరాలను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎండి ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

దేశ పారిశ్రామిక అభివృద్ధిలో ఎన్‌టీపీసీది కీలక పాత్ర


ఎన్‌టీపీసీ జెండాను ఆవిష్కరిస్తున్న జీఎం

జ్యోతినగర్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దేశాభివృద్ధిలో ఎన్‌టీపీసీ కీలకపాత్ర పోషించినట్టు రామగుండం ప్రాజెక్టు జీఎం అలోక్ త్రిపాఠి పేర్కొన్నారు. ఎన్‌టీపీసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గురువారం ఏడీఎం బిల్డింగ్ ఆవరణలో ఘనంగా జరిగాయి. ఎన్‌టీపీసీ పతాకాన్ని ఆవిష్కరించిన జీఎం, కేక్‌ను కట్ చేశారు. ఈసందర్భంగా జీఎం అలోక్ త్రిపాఠి మాట్లాడారు. 50 ఏళ్ళుగా దేశానికి ఎన్‌టీపీసీ వెలుగును అందిస్తున్నదని, దేశంలో నాలుగవ వంతు విద్యుత్ ఎన్‌టీపీసీ ద్వారా ఉత్పత్తి అవుతున్నట్టు పేర్కొన్నారు. 1975లో సింగ్రోలి ప్రాజెక్టు ద్వారా ఎన్‌టీపీసీ ప్రస్థానం ప్రారంభమైందని, ప్రస్తుతం 76 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని కలిగి ఉన్నట్టు అలోక్ త్రిపాఠి పేర్కొన్నారు. దేశాభివృద్ధిలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలే కీలకమని తెలిపారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల జీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఓదెల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గూడెం, బాయమ్మపల్లి, ఇందుర్తిలో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులకు సన్న రకాల ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని, ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని విక్రయించి నష్టపోవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడినిచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలి


సుల్తాన్‌పూర్‌లో పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఎలిగేడు,నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు అధిక దిగుబడిని అందించే కెఎన్ఎం12368రకం వరివంగడాలను ఎంచుకోవాలని రాజేంద్రనగర్ వ్యవసాయ ప్రత్యేక శాస్త్రవేత్త సీహెచ్ దామోదర్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్‌లో గురువారం మండల ఉత్తమ రైతు రావాటి పుల్లారావు వ్యవసాయక్షేత్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కునారం వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి రెండవ యేడు చిరుసంచుల పరీక్షలో 129-130 రోజుల పంట కాలం కలిగిన అతి సన్న రకమని తెలిపారు. అగ్గితెగులు, చేనుమీద పడకుండా గింజలు రాలకుండా ఉంటూ బీపీటీ రకం 20రోజుల ముందుగా కోతకు వస్తుందన్నారు. రైతు పుల్లారావు మట్లాడుతూ నాకున్న 30ఎకరాల్లో కెఎన్ఎం12368రకం వేశానని బియ్యం నాణ్యమైనవిగా ఉన్నాయని తెలిపారు. సమావేశంలో కునారం వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్‌సిద్ధికి, ఏవో ఉమాపతి, ఏఈవో గణేష్ పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలి

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రామగుండం 30వ డివిజన్ మల్లికార్జుననగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని నగర మేయర్ బంగి అనిల్ కుమార్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గురువారం కల్వర్టు నిర్మాణ పనులను మేయర్ పరిశీలించారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రగతి నిధులతో 12 లక్షల వ్యయంతో కల్వర్టు నిర్మాణం చేపడుతున్నట్టు మేయర్ పేర్కొన్నారు. సాధ్యమైనంత త్వరలో కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి ఉపయోగంలోకి తీసకువస్తామని అన్నారు. అనంతరం సింగరేణి కమ్యూనిటీహాల్‌లో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి జరుగుతున్న ఎంపిక శిబిరాన్ని మేయర్ సందర్శించారు. అర్హులైన శారీరక వికాలంగులకు బ్యాటరీ ఆపరేటెడ్ ట్రైసైకిళ్ళను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయనున్నట్టు మేయర్ అనిల్‌కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అర్హులైన వారందరికీ పరిమితి లేకుండా ఉపకరణాలు పంపిణీ చేయడం జరుగుతుందని, అర్హులైన వారు సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకోవాలని మేయర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మేయర్ వెంట జిల్లా సంక్షేమాధికారి వేణుగోపాల్‌రావు, వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ కొట్టె రాజయ్య, ఐసీడీఎస్ సీడీపీవో అలేఖ్య, వికలాంగుల సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

హోంగార్డుల కుటుంబానికి ఆర్థిక చేయూత


చెక్కును అందజేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రామగుండం కమిషనేట్ పరిధిలో చనిపోయిన హోంగార్డుల కుటుంబాలకు మంజూరైన చెక్కులను గురువారం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అందజేశారు. హోంగార్డులు బీ శ్యాం కుమార్, బీ వెంకటేశం, కే నగేష్, ఎం ఫిరోజ్‌ఖాన్ కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర హోంగార్డు సంక్షేమ నిధి నుండి రూ.15 వేల చొప్పున మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హోంగార్డు ఆర్ఐ మల్లేశం పాల్గొన్నారు.

ఓసీపీ-2లో డంపర్ ఏసీ క్యాబిన్ ధ్వంసం

రామగిరి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో గురువారం మొదటి షిఫ్టులో డంపర్ మరో ఆగిఉన్న డంపర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఢీకొట్టిన డంపర్ ఏసీ క్యాబిన్ ధ్వంసం అయినట్లు తెలిసింది. ఓసీపీ-2 క్వారీలోని బంజారు రోడ్ సమీపంలో ఎదురుగా వస్తున్న డంపర్‌లకు దారిచ్చేందుకు వంద టన్నుల సామర్థ్యం కలిగిన మూడు డంపర్‌లను నిలిపివేశారు. అదేదారిలో 33 నంబర్‌గల డంపర్ నిలిపి ఉన్న డంపర్‌ను వెనుకనుంచి ఢీకొట్టడంతో క్యాబిన్ ధ్వంసం అయినట్లు సమాచారం. ఏసీ క్యాబిన్‌కు సుమారు రూ.90లక్షల మేర నష్టం జరిగినట్లు అంచనా. ఘటనా స్థలంలో నుంచి డంపర్‌ను అధికారులు హుటాహుటిన తొలగించారు.

క్రీడాకారులకు అభినందనలు

సుల్తానాబాద్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మామిడి మనీష అనే విద్యార్థిని రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయింది. ఇటీవల కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్ 19 విభాగం పోటీలలో మనీష ప్రతిభను చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, స్పోర్ట్స్ గేమ్స్ ఇంచార్జి సునీల్ తెలిపారు. ఈ కళాశాలలో బీపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మనీష రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు మాధవీలత, మమత, హరిక్రిష్ణ, గణేష్ తదితరులు అభినందిస్తూ సన్మానించారు.

కాగా, సుల్తానాబాద్ పట్టణంలోని ఖేలో ఇండియా శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఇద్దరు విద్యార్థులు కూడా రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు కేంద్రం కోచ్ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడు గెల్లు మధూకర్ తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని సెయింట్ మెరీస్ స్కూల్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలలో అజయ్, మహాలక్ష్మీలు ప్రతిభను చాటుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్టు ఆయన తెలిపారు. వీరిని జిల్లా క్రీడల యువజన శాఖ అభివృద్ధి అధికారి సురేష్, దాసరి రమేష్, రవిందర్, ప్రసాద్, ఇక్బాల్ అజ్జూ అభినందించారు.

● ధర్మారం (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8నుంచి 10 వరకు జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ధర్మారం మండలం కేంద్రంలోని స్థాయి మణికంఠ మోడరన్ స్కూల్ విద్యార్థి ఎం. రిత్విక ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ తెలిపారు. ఈనెల 5న, ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్ బాల్ సెలక్షన్‌లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. కాగా 10 వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రిత్విక ఆడనున్నది. విద్యార్థినిని ఎండి జైన రమాదేవి, పీఈటీలు సాయికుమార్, అశ్విని, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నిట్టూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఖోఖో క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి సెయింట్ మేరీ స్కూల్‌లో నిర్వహించిన అండర్ 17 ఖోఖో క్రీడా పోట్లీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల రాష్ట్రస్థాయి పోటీలు ఖమ్మం జిల్లా కల్లూరులో 8,9,10 తేదీల్లో జరగనున్నట్లు, ఆ పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని ఎంపిక కావడంపై పలువురు అభినందించారు.

● పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జీడినగర్ యూనివర్సల్ పాఠశాల విద్యార్థులు సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ ఇస్మాయిల్ గురువారం తెలిపారు. ఈనెల 4వ తేదీన జిల్లాలోని రామగిరి మండలం సెంటినరీ కాలనీలో జరిగిన సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 8,9,10వ తేదీలలో నిర్మల్ జిల్లా ఎన్టీఆర్ స్టేడియంలో జరిగె రాష్ట్రస్థాయి పోటీలకు అఫ్షజియా, రిజా తబస్సుమ్, ఏంజలి, అంకిత్ చరణ్, రాంచరణ్, సాయి ప్రణీత్, అభిషేక్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్, ఉపాధ్యాయులు అభినందించారు.